TELTEL/2023/87917

# జనం వెలుగు

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com అనునిత్యం అక్షరసత్యం

విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను


ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 02 | సంచిక : 331 | శనివారం 22 - 02 - 2025 | ఎడిటర్ : సీతార్ల సురేష్ | పేజిలు : 8 | వెల : 6 /-

## బీసీల చుట్టూనే రాజకీయం

**జనంవెలుగు, హైదరాబాద్, ఫిబ్రవరి 21:-** తెలంగాణలో రాజకీయాలు బీసీల చుట్టూనే తిరుగుతున్నాయా? అధికార కాంగ్రెస్ పార్టీ వేసిన అస్త్రానికి విపక్షాల్లో వణుకు మొదలైందా? అదే జరిగితే తమ పరిస్థితి ఏంటని నేతలు ఎందుకంటున్నారు? వచ్చే ఎన్నికలు బీసీల చుట్టూనే రాజకీయాలు తిరుగుతాయా? అదే జరిగితే బీఆర్ఎస్ పరిస్థితి ఏంటనేది అసలు చర్చ. దీనిపై హైకమాండ్ నుంచి నేతలకు ఎలాంటి సంకేతాలు వచ్చాయి?రాజకీయాల్లో ఎత్తుకు పైఎత్తులు వేయాలి. సమయం, సందర్భంగా వ్యవహరించిన వారు మాత్రమే నిలదొక్కుకుంటారు. లేకుంటే వెనుకబడిపోవడం ఖాయం. తెలంగాణలో రాజకీయాలు ఇప్పుడు బీసీల చుట్టూనే తిరుగుతోంది. కాంగ్రెస్ ప్లాన్ ప్రకారం బీసీలకు రాజ్యాధికారం కావాలనే పట్టుబడుతున్నారు ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ. ఈ క్రమంలో తెలంగాణలో ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏడాదిలోపు కులగణన చేపట్టారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 56 శాతం ఉందని నివేదిక తేల్చింది.తెలంగాణకు భవిష్యత్తులో బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అవుతాడని బయటపెట్టారు టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్. రాష్ట్రానికి బీసీ వ్యక్తిని సీఎం చేయడం కాంగ్రెస్ పార్టీతోనే



సాధ్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఐదేళ్లు కొనసాగుతారని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికలు బీసీల చుట్టూనే తిరుగుతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామని ఓబీసీ సెల్ కార్యవర్గ సభ్యులకు పిలుపునిచ్చారు ఆయన. ఈ వ్యవహారంపై మిగతా రాజకీయ పార్టీల్లో చర్చ మొదలైంది. 2014 ఎన్నికల్లో బీసీ వ్యక్తి సీఎం అనే నినాదాన్ని ఎత్తుకుంది టీడీపీ. ఆ సమయంలో టీడీపీకి బాగానే సీట్లు వచ్చాయి. ఇక 2023 నాటికి వద్దాం. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో నల్గొండలో జరిగిన బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తి సీఎం అవుతారని చెప్పుకొచ్చారు ఆయన.కాంగ్రెస్‌ను దెబ్బకొట్టడానికి అప్పట్లో ఈ ఫార్ములాను అమిత్ షా ఉపయోగించారనే ప్రచారం సాగింది. ప్రస్తుతానికి వచ్చేద్దాం.. రాహుల్‌గాంధీ మొదటి నుంచి బీసీ నినాదం ఎత్తుకున్నారు. ఈ విషయంలో బీజేపీ తర్జన భర్జన పడుతోంది. ఏం చెయ్యాలో తికమక పడుతోంది. కనీసం కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నట్లుగా కులగణన చేయడానికి ముందుకు రావడంలేదు.ఇక బీఆర్ఎస్ విషయానికొద్దాం. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ చేసిన కామెంట్స్ బీఆర్ఎస్‌లో అప్పుడే అలజడి మొదలైనట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాబోయే రోజుల్లో కాబోయే ముఖ్యమంత్రి బీసీయేనని చెప్పడంతో ఒక్కసారిగా నేతలు షాకయ్యారు. దీనిపై ఏ ఒక్కరూ నోరు ఎత్తకూడదని సంకేతాలు వెళ్లినట్టు ప్రచారం మొదలైపోయింది. 2014 ఎన్నికల్లో తెలంగాణ వస్తే దళితుడ్ని సీఎం చేస్తామని కేసీఆర్ పదేపదే చెప్పుకొచ్చారు. గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బీసీ, మహిళలకు సరైన ప్రాధాన్యత దక్కలేదని చాలామంది నేతల మాట. ప్రస్తుతం టీపీసీసీ చీఫ్ విసిరిన బీసీ బాణం.. అప్పుడే ఆ పార్టీలో చర్చకు దారితీసిందని సమాచారం. మరి జాతీయ పార్టీల మాదిరిగా బీఆర్ఎస్ పార్టీ కూడా బీసీ నినాదం ఎత్తుకుంటుందా? అన్నదే అసలు పాయింట్. మొత్తానికి కాంగ్రెస్ ట్రాప్‌లో కారు పడినట్టేనని అంటున్నారు.

## మహాశివరాత్రి ఏర్పాట్లు పూర్తి



**జనంవెలుగు, వేములవాడ:-** దక్షిణ కాశీ వేములవాడలో మహాశివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఈనెల 25 నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలు జరగనున్నాయి.మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు నాలుగు లక్షల మంది భక్తులు హాజరై, స్వామివారిని దర్శించుకుని కోడె మొక్కులు చెల్లిస్తారని అంచనా వేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి వినోద్ తెలిపారు.భక్తుల కోసం ఐదు లక్షల లడ్డూలు, పులిహోర ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.శివరాత్రి రోజు స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అల్పాహారం పంపిణీ చేసేందుకు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.క్యూ లైన్ లలోని భక్తులకు మజ్జిగ, పండ్లు అందజేసేందుకు ఏర్పాటు చేశామన్నారు.జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో మహాశివరాత్రి ఏర్పాట్లు పూర్తిస్థాయికి చేరుకున్నాయని వివరించారు. ఉత్సవాలకు హాజరై అనారోగ్యం బారిన పడే భక్తుల కోసం ప్రత్యేకంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

## కొత్తగా అందుబాటు లోకి హెచ్బీఎటీ చికిత్స

**జనంవెలుగు, హైదరాబాద్:-** హైదరాబాద్ నగరంలోని వైద్య చికిత్సల్లో ఇదో సరికొత్త విప్లవం. నగరంలో ఇన్నాళ్లుగా అందుబాటులో లేని హైపర్బేరిక్ ఆక్సిజన్ థెరపీ (హెచ్బీఓటీ) సాయంతో 20 మందికి రాస్ మెడికల్ ఫిట్నెస్ సెంటర్ విజయవంతంగా చికిత్స అందించింది. హెచ్చ బి ఓటీ అనేది ఒక నాన్ ఇన్వేజివ్ థెరపీ. ఇందులో ఆరోగ్యం కావాలనుకునేవారు ప్రెషరైజ్డ్ ఛాంబర్లో 100శాతం స్వచ్ఛమైన ఆక్సిజన్ పీల్చుకుంటారు. దీనివల్ల శరీరం ఆక్సిజన్ ను మరింత మెరుగ్గా స్వీకరిస్తుంది. ఈ ప్రక్రియ సెల్యులార్ మరమ్మతును వేగవంతం చేస్తుంది. యాంటీ ఏజింగ్ ప్రయోజనాలను ప్రోత్సహిస్తుంది. నాడీ, జీవక్రియ ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది, మంటలను తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇలా మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఈ చికిత్సను ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా వైద్య నిపుణులు, అథ్లెట్లు, వెల్నెస్ ఔత్సాహికులు విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు హైదరాబాద్ నగరంలో కూడా దాని ప్రయోజనాలు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. ఈసందర్భంగా ఫిజికల్ థెరపిస్ట్ సయ్యద్ ఖలీల్ మాట్లాడుతూ... తాము హైదరాబాద్లో మొట్టమొదటి హెచ్బిఒటి (హైపర్బారిక్ ఆక్సిజన్ థెరపీ) ఛాంబర్ను పరిచయం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇది మేక్ ఇన్ ఇండియా ఉత్పత్తి గా, ఆరోగ్య పునరుద్ధరణ, యాంటీ -ఏజింగ్ పరిష్కారాలను విప్లవాత్మకంగా మార్చుతోందన్నారు. ఈ అత్యాధునిక చికిత్స ఆక్సిజన్ శోషణను పెంచి, మానవ శరీరపు స్వాభావిక నయం చేసే శక్తిని వేగవంతం చేస్తుందన్నారు. మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు.

## ఎలాంటి మార్పు లేని తెలంగాణ పాలన

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**జనంవెలుగు, మెదక్:-** సీఎంలు మారారే గానీ తెలంగాణ పాలనలో ఎలాంటి మార్పు లేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. రాబోయే శాసనమండలి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను మేధావులు గెలిపించి సత్తా చాటాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నాడు అయన మెదక్ పట్టణంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల తరువాత ప్రజా సమస్యలపై ఉద్యమబాటలో పయనిస్తామన్నారు. అనేక రాష్ట్రాల్లో మోదీ నేతృత్వంలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏ విధంగా అభివృద్ధిలో దూసుకుపోతుందో చూస్తున్నారని చెప్పారు. కర్ణాటక, హిమాచల్, తెలంగాణలో అవినీతి, అక్రమ ప్రభుత్వాల చేతకాని విధానాల వల్ల కనీసం జీతాలివ్వలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన గ్యారెంటీలు, సబ్ గ్యారెంటీల మాట దేవుడెరుగు, కనీస హామీలను కూడా అమలు చేయలేని పరిస్థితుల్లో 14 నెలలుగా తెలంగాణలో కాంగ్రెస్ పాలన కొనసాగుతుందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణను అప్పులకుప్పగా మార్చాయని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి మండిపడ్డారు.

### దశ, దిశను సూచించే ఎన్నికలు.

తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్ర దశ దిశను సూచించే ఎన్నికలని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ లో శుక్రవారం ఉదయం ఉపాధ్యాయులతో జరిగిన మీట్ అండ్ గ్రీట్ లో పాల్గొని ప్రసంగిస్తూ బీఆర్ ఎస్, కాంగ్రెస్ విధానాలను తూలనాడారు. మేధావులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, రైతులు, రైతు కూలీలు, మహిళలు, ప్రజలను మభ్యపెట్టి




అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమలులో చతికిలపడిందని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ భృతి రూ. 4వేలు, మహిళలకు రూ. 2500, ప్రతీ దళిత కుటుంబానికి రూ. 12 లక్షలు, రైతులు, రైతు కూలీలకు ఆదుకుంటామన్న హామీలన్నీ నీటిమూటలుగానే మిగిలాయన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ హామీలిచ్చి ఇప్పుడు వారిని కనీసం కలవడం కూడా లేదని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చినవి, చేసినవన్నీ మోసపూరిత హామీలేనని, ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఇంకేం లేవన్నది తేలిపోయిందని కేంద్రమంత్రి విమర్శించారు.

## పురుడు పోసుకున్న తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమ్

### భవిషత్ కార్యాకరణకు హడ్ హక్ కమిటీ ఎన్నిక

**జనంవెలుగు, హైదరాబాద్ ఫిబ్రవరి 21:-** తెలంగాణాలో బిసి జర్నలిస్ట్ ల ఐక్యతకు పునాదులు పడ్డాయి. తాజాగా తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమ్ పురుడు పోసుకుంది. ఈ మేరకు శు క్రవారం హైదరాబాద్ లో బిసి జర్నలిస్ట్ ల సమావేశం జరిగినది. ఈ సందర్భంగా పలు అంశాలపై కూలంకషంగా చర్చించారు. బవిషత్ కార్యాకరణకు హడ్ హక్ కమిటీ ఎన్నిక జరిగింది.గౌరవ సలహా దారులుగా సినీయర్ జర్నలిస్టులు అంబటి సురేందర్ రాజు, కే వేణుగోపాల్, కైలాష్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా శ్రీనివాస్ గౌడ్, ప్రసిడెంట్‌గా నీలం వెంకన్న, వైస్ ప్రసిడెంటగా ఇంద్రశేన్, ప్రధాన కార్యదర్శిగా బద్దోళ శ్రీధర్ యాదవ్, కో ఆర్డినేటర్గ దొమ్మాట వెంకన్న, ఆర్గనైగింగ్ కార్యదర్శిగా మహేశని లక్ష్మయ్య లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యల మీద అనేక చర్చలు ప్రస్తావించారు. ముఖ్యంగా మండల్, జిల్లా స్థాయిలో ఫోరం బలోపేతానికి కృషి చేయాలనీ, తీర్మానం చేశారు.

## మ్యానిఫెస్టోను అమలు చేసి మాట నిలబెట్టుకోండి

**జనంవెలుగు, హైదరాబాద్:-** ఉన్నతమైన డీఎస్పీ పోలీసు ఉద్యోగాన్ని స్వచ్ఛందంగా వదులుకొని ప్రజా సేవకు అంకితం అవ్వాలని ఉద్దేశంతో కరీంనగర్, మెదక్,నిజామాబాద్,అదిలాబాద్ పట్టభద్రుల ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడిన తనను కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది అని మదనం గంగాధర్ ఆరోపించారు. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన మేనిఫెస్టోను అమలు చేస్తానన్న షరత్తును ఒప్పుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు తనను పట్టించుకోవడం లేదు అని వాపోయారు. ఈ మేరకు కార్యక్రమంలో పోకల కిరణ్ కుమార్ మాదిగ, దయానంద్ పాల్గొని మాట్లాడారు.తన చిన్నతనం నుండి మధనం గంగాధర్ అత్యంత పేదరికంలో మగ్గి కష్టపడి పోలీస్ శాఖలో డీఎస్పీ స్థాయికి ఎదిగారు అని అన్నారు. పోలీస్ శాఖలో ఒక మచ్చ లేకుండా తన విధులను నిర్వర్తించి పోలీస్ శాఖ కి వన్నెతెచ్చిన వారు ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాలయితే ప్రజలకు దగ్గరుంటానని ఒక ఆలోచనతో ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేయడానికి సిద్ధపడ్డారన్నారు. అలాంటి గొప్ప మనిషి అయిన మదనం గంగాధర్ ను కాంగ్రెస్ పార్టీ వారి మేనిఫెస్టోను అమలు చేస్తానని హామీ ఇచ్చి తీరా వారు ఎన్నికల నుండి తన నామినేషన్ను ఉపసంహరించుకున్నాక పట్టించుకోకపోవడం దారుణమైన విషయమనే అన్నారు. వెంటనే కాంగ్రెస్ పార్టీ మదనం గంగాధర్ రూపొందించిన మేనిఫెస్టో అమలుపై స్పష్టమైన హామీ ఇచ్చి ప్రకటన చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తదుపరి తమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.



## ‘2009లో మేం బిక్ష వేస్తే.. కెసిఆర్ ఎంపి అయ్యారు’: సిఎం రేవంత్ రెడ్డి

**జనంవెలుగు, నారాయణ్‌పేట ఫిబ్రవరి 21:** దేశంలో ఎక్కడ ఏ ప్రాజెక్టు కట్టినా.. మట్టి తీసేది మా పాలమూరు బిడ్డలే అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. నారాయణ్‌పేట్ జిల్లా అప్పకపల్లిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన బిఆర్ఎస్ పార్టీపై విమర్శల వర్షం కురిపించారు. ‘2009లో మేం బిక్ష వేస్తే.. కెసిఆర్ ఎంపి అయ్యారు’ అని రేవంత్ పేర్కొన్నారు. ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో కెసిఆర్ ప్రజల సొమ్మును దోచుకున్నారని ఆయన మండిపడ్డారు. పదేండ్ల కెసిఆర్, 11 ఏళ్ల మోడీ పాలనపై చర్చకు తాను వస్తానని.. కెసిఆర్, కిషన్ రెడ్డిలు వస్తారా అని సవాలు విసిరారు.తనపై పగతో పాలుమూరుపై కెసిఆర్ కక్షగట్టారు అని అన్న రేవంత్ పాలమూరు ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే చంద్రబాబుతో పంచాయతీ ఉండేది కాదు అని పేర్కొన్నారు. జగన్‌ను పిలిపించి రాయలసీయ



ఎత్తిపోతలకు పథకం రచించింది కెసిఆర్ కాదా అని ప్రశ్నించారు. దీంతో పాలమూరుకు పారాల్సిన నీళ్లను రాయలసీయకు తరలించారు అని మండిపడ్డారు. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కట్టిన కెసిఆర్ వేల కోట్లు దోచుకున్నారని అన్నారు. నీళ్లు రాయలసీమ తరలించుకుపోతే.. నిధులు కెసిఆర్ దోచుకున్నారని రేవంత్ తెలిపారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఖాతాలోకే ఓటు - సర్దార్ రవీందర్ సింగ్




**జనం వెలుగు, నిజామాబాద్, ఫిబ్రవరి 21:–** నిజామాబాద్ జిల్లా ప్రెస్ క్లబ్‌లో మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్, కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ మీడియాతో మాట్లాడారు. ఆయన తనపై కుట్రలు జరుగుతున్నాయంటూ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు కలిసి ప్రసన్న హరికృష్ణను బీఆర్ఎస్ పార్టీలో చేర్చేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. కాంగ్రెస్ కుట్రలు, అక్రమాలపై ధ్వజమెత్తిన రవీందర్ సింగ్ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగట్లేదని, తన నామినేషన్ సమయంలో అడ్డంకులు సృష్టించారని సర్దార్ రవీందర్ సింగ్ మండిపడ్డారు. ఓటరు జాబితాను అనధికార వెబ్‌సైట్‌కు అందజేయడం ఎన్నికల మోసానికి తలపించడం అని తెలిపారు. అక్రమాలకు పాల్పడే వారిని వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.

**"విద్యావేత్తలు కాదు, విద్య వ్యాపారవేత్తలు" - అభ్యర్థులపై విమర్శలు**

తాను విద్యార్థి దశ నుంచే ప్రజా సేవలో ఉన్నానని, మేయర్‌గా, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్‌గా అనేక అభివృద్ధి పనులు చేసినట్లు గుర్తుచేశారు. ఒక్క రూపాయికే అంత్యక్రియల పథకాన్ని అమలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రజా సేవ కోసమే తన జీవితాన్ని అంకితం చేశానని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా ఉన్నానని చెప్పారు.

**317 జీవో బాధితులకు అండగా... రూ.5 లక్షల బీమా హామీ**

317 జీవో బాధితులకు అండగా ఉంటానని, ప్రతి పట్టభద్రుడికి కేవలం ఒక రూపాయికే రూ.5 లక్షల బీమా అందజేస్తానని హామీ ఇచ్చారు. పట్టభద్రులను మభ్యపెట్టి మోసం చేసే వారిని గమనించాలని హెచ్చరించారు.

**"బ్యాలెట్ నెంబర్ 11 - నా విజయానికి మీ మద్దతు అవసరం"**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్యాలెట్ నెంబర్ 11పై తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఫార్వర్డ్ బ్లాక్, ఆమ్ ఆద్మీ పార్టీ, జన్ ఉద్యమ కాన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎం.ఎం.పీ.టీ.ఎఫ్ అమలుకు సహాయ సహకారాలు అందిస్తాం

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**



**జనం వెలుగు, నిజామాబాద్, ఫిబ్రవరి 21 :** వలసదారులు, దుర్బల కుటుంబాల స్థితి స్థాపకతను మెరుగుపర్చాలనే లక్ష్యంతో యుఎన్ఓ ద్వారా ప్రయోగాత్మకంగా నిజామాబాద్ జిల్లాలో అమలు చేయనున్న మైగ్రేషన్ మల్టీ పార్టనర్ ఫండ్ (ఎం.ఎం.పీ.టీ.ఎఫ్) కార్యక్రమాన్ని పక్కాగా అమలు పరుస్తూ, నిర్దేశిత లక్ష్యాలు సిద్ధించేలా జిల్లా యంత్రాంగం తరపున పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఈ కార్యక్రమం అమలు విషయమై కేంద్ర ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో శుక్రవారం సమీక్ష సమావేశం జరిపారు. ఈ కార్యక్రమం ఉద్దేశ్యం, పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాను ఎంపిక చేయడానికి గల కారణాలు, ఎంఎంపీటీఎఫ్ ను అమలు చేయాల్సిన విధానం, యూఎన్ఓ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అందించే తోడ్పాటు తదితర అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలో వలసదారులు, దుర్బల కుటుంబాల స్థితిగతుల గురించి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలియజేశారు. వారి స్థితిగతులలో మార్పును ఆశిస్తూ అమలుచేయ సంకల్పించిన పైలెట్ ప్రాజెక్టును జిల్లాలో సమర్ధవంతంగా అమలయ్యేలా జిల్లా యంత్రాంగం ద్వారా పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందేలా అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. పూర్తి పారదర్శకంగా ఈ కార్యక్రమం అమలయ్యేలా చూస్తామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పి సీ.ఈ.ఓ సాయాగౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, డీడబ్ల్యుఓ రసూల్ బీ, పశు సంవర్ధక శాఖ అధికారి జగన్నాథ చారీ, డీపీఓ శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఏ.డీ.ఏ ప్రదీప్ కుమార్, సిరికొండ, ధర్పల్లి ఏ.ఓలు నర్సయ్య, వెంకటేష్, యూఎన్ఓ ప్రతినిధులు జగన్మోహన్, డాక్టర్ లిస్సీ జోసెఫ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అనిల్ ఉప్పలపాటి, వాసిల్ తదితరులు పాల్గొన్నారు.


# ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి**

**బ్యాలెట్ బాక్సుల తరలింపునకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు**

**కలెక్టర్లతో వీ.సీ ద్వారా సమీక్ష జరిపిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి**

**జనం వెలుగు, నిజామాబాద్, ఫిబ్రవరి 21:** నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలతో కూడిన కరీంనగర్ శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ ప్రక్రియను నిజామాబాద్ జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తదితరులు సమీకృత జిల్లా సముదాయాల కార్యాలయం వీ.సీ హాల్ నుంచి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు, కరీంనగర్ లోని రిసెప్షన్ సెంటర్ కు బ్యాలెట్ బాక్సుల తరలింపు, పోస్టల్ బ్యాలెట్, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాలలో వసతులు, పోలీసు బందోబస్తు, ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, నిఘా బృందాల పనితీరు పర్యవేక్షణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సంబంధిత జిల్లాల కలెక్టర్లకు కీలక సూచనలు చేశారు. వీడియో సమావేశం అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులతో మాట్లాడుతూ, ఈ.సీ మార్గదర్శకాల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సదుపాయాలను సరిచూసుకోవాలని అన్నారు. షామియానాలు, తాగునీరు, వీల్ చైర్ వంటి వసతులతో పాటు, ప్రతి పోలింగ్ స్టేషన్లో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ ఏర్పాట్లపై చేపట్టిన చర్యల గురించి రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు సమాచారం అందించాలని, సైలెన్స్ పీరియడ్ లో పాటించాల్సిన నిబంధనలు అమలయ్యేలా చూడాలన్నారు. పోలింగ్ నిర్వహణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని, విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత నడుమ కరీంనగర్ లోని రిసెప్షన్ సెంటర్ కు తరలించాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలు దెబ్బతినకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. బ్యాలెట్ బాక్సులను, మెటీరియల్ ను పీ.ఓ, ఏ.పీ.ఓలు తమ వెంట




కరీంనగర్ రిసెప్షన్ సెంటర్ కు చేర్చాల్సి ఉంటుందని, వారితో పాటు సూక్ష్మ పరిశీలకులు కూడా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ బాక్సుల తరలింపు కోసం అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని, పోలీసు బందోబస్తు మధ్యన వాటిని తరలించాలని, సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. పోలింగ్ సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, ఓటింగ్ పూర్తి పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేవిధంగా జాగరూకతతో విధులు నిర్వహించాలని హితవు పలికారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ జరపాలని, ఆయా పోలింగ్ కేంద్రాలలో కొనసాగే ఓటింగ్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని అన్నారు. పోలింగ్ ముగిసిన మీదట సాధ్యమైనంత త్వరగా బ్యాలెట్ బాక్సులను కరీంనగర్ లోని రిసెప్షన్ సెంటర్ కు చేర్చేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, అదనపు డీసీపీ కె.రామచంద్రారావు, ఏ.సీ.పీ రాజవెంకటరెడ్డి, డీటీడబ్ల్యుఓ నాగూరావు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## పేదలు, వృద్ధులను కాంగ్రెస్ ప్రభుత్వం వంచిస్తోంది

**తెలంగాణలో ఆయుష్మాన్ భారత్ అమలు చేయడంలేదు**

**ఎంపి దగ్గుబాటి పురంధేశ్వరి**

**జనం వెలుగు, హైదరాబాద్ ఫిబ్రవరి 21:–** తెలంగాణలో ఆయుష్మాన్ భారత్ అమలు చేయడంలేదని బిజెపి ఎంపి పురంధేశ్వరి తెలిపారు. కరీంనగర్ లో ఎంపి దగ్గుబాటి పురంధేశ్వరి పర్యటించిన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. పేదలు, వృద్ధులను కాంగ్రెస్ ప్రభుత్వం వంచిస్తోందని విమర్శలు గుప్పించారు. బిసిల్లో ముస్లింలను చేర్చడాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆలోచించి, ప్రణాళికలు జరపాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోడీ కులంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదని చురకలంటించారు. బిసిలను అవమానపరిచేలా రేవంత్ మాట్లాడారని పురంధేశ్వరి ధ్వజమెత్తారు.

## డీ.ఎల్.ఎన్. చారి జన్మదిన వేడుకలు ఘనంగా జరపేందుకు ఏర్పాట్లు పూర్తి






**జనం వెలుగు, నిజామాబాద్:–** జిల్లాలో ప్రముఖ సంఘ సేవకులు, సీనియర్ జర్నలిస్ట్, డిఎస్సి 1998 అధ్యక్షులు, తెలంగాణ ఉద్యమకారుల యూనియన్ నాయకులు డీ.ఎల్.ఎన్. చారి జన్మదిన వేడుకలు ఈ నెల 23న అత్యంత ఘనంగా జరపడానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ యూనియన్ నాయకులు, సంఘ సేవకులు, రాజకీయ ప్రముఖులు చారి కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక సేవలో నిరంతరం ముందుండే ఆయన కార్మిక హక్కుల పరిరక్షణ కోసం కొనసాగిస్తున్న పోరాటాన్ని ప్రశంసించారు. జన వికాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. చారి శ్రేయోభిలాషులు, అభిమానులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఈ వేడుకల్లో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేయనున్నారు. ఈ సేవా కార్యక్రమాలు మరింత మందికి మేలు చేయాలని యూనియన్ నాయకులు ఆకాంక్షించారు.

## కుంభ మేళాలో ఎమ్మెల్యే దంపతుల పుణ్యస్నానాలు



**జనం వెలుగు, బాల్కొండ:–** ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళాలో శుక్రవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, సతీమణి రేవతి రెడ్డితో కలిసి కుంభమేళాలో పుణ్య స్నానాలు ఆచరించారు. ఎన్నో ఏళ్ళకు ఒకసారి వచ్చే మహాకుంభ మేళాలో పుణ్య స్నానాలు ఆచరించడం పూర్వ జన్మలో చేసుకున్న సుకృత ఫలంగా వచ్చే అదృష్టమని ఎంఎల్ఏ అన్నాడు. హిందువులు వివిధ రూపాల్లో ఉన్న ప్రకృతిని కూడా దైవంగా భావిస్తారని అలాంటి గొప్ప ఆచారం హిందువులకు మాత్రమే ఉందని, కుంభమేళా ఏర్పాట్లు బాగున్నాయని కుంభమేళాతోపాటు దగ్గరలో ఉన్న అయోధ్య, కాశీని దర్శించుకోనున్నామని ఎమ్మెల్యే అన్నాడు.

## శస్త్ర చికిత్సకై ఎల్ఓసి అందజేత



**జనం వెలుగు, బాల్కొండ:–** బాల్కొండ నియోజక వర్గంలోని మండల కేంద్రమైన భీంగల్ పట్టణానికి చెందిన తీవ్రమైన మోకాలి నొప్పితో బాధపడుతున్న ప్రేమలకు శస్త్ర చికిత్సకై 125,000 రుపాయల ఎల్ఓసిని బాల్కొండ నియోజక వర్గపు కాంగ్రెసు పార్టీ ఇంచార్జి సునీల్ రెడ్డి ద్వారా అందజేయడం జరిగింది. హైదరబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో మోకాలి నొప్పితో చేరగా, మోకాలికి శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించగా అందుకు వైద్య ఖర్చుల కొరకు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డిని సంప్రదించగా, ఆయన సిఎం సహాయ నిధి నుండి 1,25,000 రూపాయల ఎల్ఓసిని అందించడం జరిగింది. ఆపదలో ఉన్న వారిని ఆదుకున్న ముత్యాల సునీల్ రెడ్డికి బాధిత వ్యక్తి ధన్యవాదాలు తెలిపడం జరిగింది.

## ఎంఎల్సీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు



**జనం వెలుగు, నందిపేట్:–** నందిపేట్ మండల్ కేంద్రంలోని సాయిబాబా గార్డెన్‌లో ఎంఎల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు మరియు గ్రాడ్యుయేట్ ఓటర్లతో సమావేశం జరిగింది. నందిపేట్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్, ఆర్మూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ, ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి బలపరిచిన అభ్యర్థి ఆల్ఫోన్స్ నరేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. బ్యాలెట్ పేపర్‌లో సీరియల్ నంబర్ రెండు పైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నరేందర్ రెడ్డిని విజయం సాధింపజేయాలని పిలుపునిచ్చారు. మండలంలో అభివృద్ధి జరగాలంటే, నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలంటే నరేందర్ రెడ్డికి ఓటు వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పెంట ఇంద్రుడు, సాయిబాబా గౌడ్, సుదర్శన్, ఐసబ్, గోజ్జి రాజేందర్, దేవిదాస్ గౌడ్, జమీల్, ప్రశాంత్, పీరాజీ నాగరాజు, హరీష్, కిష్టగౌడ్, వైస్ గంగాధర్, ఫరీద్, దమ్మాయి శ్రీను, తిమ్ముల శివ, తుక్కన్న, తబ్రేజ్, లింగం ఎర్రం, కల భోజన్న, బర్కి నర్సయ్య, కొండూరు సంజీవ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారుతున్న బడి బాత్రూమ్

**ప్రమాదం జరగక ముందే స్పందించాలి**

**జనంవెలుగు, నందిపేట్:–** నందిపేట్ మండలం లక్కంపల్లి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో పైపు లీకేజీ కారణంగా బాత్రూం గోడలు మొత్తం నీరు కారిపోగా, దాంతో పాటు పెచ్చులు ఊడిపోవడం జరిగింది. ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ లోపం వల్ల బాత్రూం శిథిలావస్థకు చేరుతుందనడానికి సందేహమేమి లేదు. ఈ పరిస్థితిలో విద్యార్థులు ప్రతి క్షణం భయంతో ఉన్నారు. ఇది ప్రమాదకరంగా మారకముందే సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

